# బుజ్జికుక్క

కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లున్నా కడతేరి పోతున్నాం
కుక్కపిల్లలేం చేస్తాయి?
కరవటానికో మొరగటానికో తప్ప
ఏదో ముచ్చటపడి తెచ్చుకున్నాం ఓ బొచ్చుకుక్కని
ఉన్నంతలో అపురూపంగానే పెంచుకున్నాం
దాని అల్లరిని – చిందర వందరని ఆనందంగానే భరించాం
ఇంతలో ఇంకో కుక్క తోడైంది
ఇంక వాటిని భరించటం అసాధ్యమైంది
ఊరకనే వదిలేస్తే ఊరకుక్కలో
ఆకతాయి రాళ్లకు పిచ్చికుక్కలో
అవుతాయని భయపడ్డాం
అడిగిన వాళ్లందరిలో ఎంచి ఎంచి
ఏ లోటూ రానివ్వరన్న వారికిచ్చి
ఎన్నాళ్లో కానే లేదు
అన్ని బంధాలను తెంచుకుని ఇంటి కొచ్చేసింది
దీనంగా కళావిహీనంగా మా బుజ్జికుక్క
చెప్పొద్దూ –
దాన్ని చూసిన వెంటనే గతుక్కుమన్నాం
తప్పు చేసిన వాళ్లలా
ముందర మా మొహాలే ఎత్తలేకపోయాం
నోరులేక పోతేనేం –
ఎక్కడో కట్టి పడేస్తేనేం?
సరైన పోషణ లేదని –
సంతోషంగా వారు దాన్ని పెంచనే లేదని
గేటు తెరిచే సరికి అందరిమీదకు గెంతినప్పుడే
తెలుసుకోగలిగాం

ఎప్పుడు తిన్నదో – ఏమి తిన్నదో నని
రొట్టి ముక్క దాని ముందు పడేస్తే
అది ముట్టనన్నా ముట్టలేదు
ఈ మాత్రం విసిరే ముక్కలు
వారూ వేసారనేమో
అది తుంచి నోటికందిస్తేనే గాని తిననన్నా తినలేదు
మా బుజ్జికుక్క . . . . .